విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

సత్యసాయి తాగునీటి పథకం

కార్మికులను తొలగిస్తామనడం సరికాదు

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

సత్యసాయి తాగునీటి పథకం కార్మికులను తొలగిస్తామని బెదిరించడం తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డికి సరికాదని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు అన్నారు. బుధవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఓబులు మాట్లాడారు. చేసిన పనికి వేతనాలు అడిగితే కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించాలనే కుట్రకు తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తెరలేపారని విమర్శించారు. తాడిపత్రి నియోజకవర్గం పరిధిలో పనిచేసేకార్మికులను తొలగించి వారి స్థానంలో కొత్తవారిని నియమించాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఈకి ఎమ్మెల్యే లేఖ పంపినట్లు తెలిసిందన్నారు. కార్మికుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని గుర్తు చేశారు. శ్రీ సత్యసాయి నీటి పథకాన్ని పరిరక్షించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు బడ్జెట్ కేటాయించి, పని చేసి సిబ్బంది వేతన ఇతర ప్రయోజనాలు సక్రమంగా చెల్లించడానికి ప్రజాప్రతినిధిగా చొరవ చూపకుండా ఇలాంటి అనాలోచితమైన ఆలోచనలు చేయడాన్ని విరమించుకోవాలని సూచించారు. ఇలాంటి భూస్వామ్య లక్షణాలు నుండి తమ ఆలోచనలు మార్చుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఆలోచనలు చేస్తే కార్మిక వర్గం పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఉంటుందని హెచ్చరించారు. తాగునీటి పథకం కార్మికులకు వేతనాలు సకాలంలో చెల్లించడం లేదన్నారు. నిర్వహణ బాధ్యతల నుంచి ఎల్ అండ్ సంస్థ తప్పుకున్న తర్వాత ఆరు నెలలకు ఒకసారి కూడా వేతనాలు ఇవ్వని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు సురక్షితమైన నీరు అందించడం కోసం ఇప్పటికైనా ఎమ్మెల్యే సత్యసాయి పథకం నిర్వహణ కోసం బడ్జెట్ కేటాయింపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం నాగమణి, ఎస్ నాగేంద్ర కుమార్, జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, జగన్ మోహన్ రెడ్డి, శ్రీ సత్యసాయి వాటర్ సప్లై యూనియన్ నాయకులు తిరుపాల్ నాయక్, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులకు

ఎకరాకు రూ. 50 వేలు పరిహారం ఇవ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

తొలగించిన వేరుశన పంటను పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి ఉరవకొండ

తీవ్రవర్షభావ పరిస్థితుల్లో వేరుశనగ పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు 50 వేల రూపాయలు నష్టపరహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం మండల పరిధిలోని భూదగవి గ్రామంలో వేరుశనగను విడపనకల్ మండల పరిధిలోని ఉండబండ గ్రామంలో మిరప పంట పొలాలను పరిశీలించారు. ఆయనతో పాటు సిపిఎం ఉరవకొండ మండల కన్వీనర్ మధుసూదన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కష్ణమూర్తి,కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు రంగారెడ్డి,బాల రంగయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు జ్ఞానమూర్తి తదితరులు పంటపొలాలను పరిశీలించారు. బుదగవి గ్రామానికి చెందిన వన్నూరుస్వామి తన రెండున్నర ఎకరాల సొంత పొలంతో పాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని వేరుశనగ పంట సాగు చేశాడు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన తిప్పేస్వామి మూడు ఎకరాలలో వేరుశనగ పంట సాగు చేశాడు. వన్నూరు స్వామి అనే రైతు హైదరాబాదులో అయ్యప్ప ఇన్ఫ్రాస్ట్రక్చర్ అనే కంపెనీలో ఉద్యోగం చేసి అక్కడ సంపాదించుకున్న కొంత మొత్తాన్ని తన సొంత పొలంలో వ్యవసాయ పనుల నిమిత్తం పెట్టుబడి పెట్టి అప్పుల పాలయ్యాడు. ఈ రైతులతో రాంభూపాల్ మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను నాయకులకు వివరించారు. రాజకీయ నాయకులకు తమ ఓట్లు మాత్రమే అవసరం అనిరైతాంగ సమస్యలు పట్టవని ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది రూపాయలు అప్పులు చేసి పంటలు సాగు చేసి తీవ్రంగా నష్టపోయిన పరిస్థితి నెలకొందన్నారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ మాట్లాడుతూ ఉరవకొండ నియోజకవర్గంలోని నాయకులు రైతాంగ సమస్యలను పట్టించుకోకుండా స్వార్ధ రాజకీయాలు చేస్తూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. పంట చేతికొచ్చే సమయంలో సరైన వర్షాలు లేక వేరుశనగ పంటతో పాటు ఇతర పంటలు పూర్తిగా ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని ఏం చేయాలో దిక్కుతోచక రైతులు పంటలను తొలగించే పరిస్థితి నెలకొందన్నారు పెట్టిన పెట్టుబడి కూడా రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు రాజకీయ నాయకులు కాలయాపన చేస్తున్నారే తప్ప ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటున్న పాలకులు రైతులకు చేసిందేమీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయంలో రైతులు నష్టపోతున్నా రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకుండా రైతుల జీవితాలతో చెలగాటం మాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 సంవత్సరాల క్రితం హంద్రీనీవా కెనాల్ కింద తవ్విన పిల్ల కాలువల్లో పూర్తిగా చెట్లు పెరిగి కనిపించకుండా పోయాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం వజ్రకరూరు మండల కన్వీనర్ విరుపాక్షి, రైతు సంఘం నాయకులు సీనప్ప, సిద్ధప్ప, మురళి, రవి, సుధాకర్‌తో పాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పట్టని పాలకులు : రైతాంగ సమస్యలు పాలకులకు పట్టడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ విమర్శించారు. ఈ మేరకు ఆయన బుధవారం సిపిఎం ఉరవకొండ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఉరవకొండ నియోజకవర్గంలో హంద్రీనీవా కెనాల్ ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు ఇస్తామన్న హామీని నెరవేర్చలేదన్నారు. అధికార,ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు రైతుల జీవితాలతో చలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో మాత్రమే స్వార్ధ రాజకీయాలు చేస్తూ అధికార దాహంతో హామీలను ఇస్తూ ప్రజలను మోసం చేయడం బూర్జువా పార్టీల నాయకులకు పరిపాటిగా మారిందన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు ఒకటి రెండవ దశ నిర్మాణ పనులలో భాగంగా నిధులు కేటాయించి పూర్తి చేసినట్లయితే లక్షలాదిమంది రైతులకు మేలు జరిగేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కౌలు రైతు పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు పంపిణీ చేసి రుణాలు మంజూరు చేయకుండా మోసం చేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో అధికార ప్రతిపక్ష పార్టీల నాయకులు ప్రజా సమస్యలను రైతాంగ సమస్యలను పక్కనపెట్టి జైల్లో ఉన్నవాళ్ళు ఎలా బయటకు రావాలి,జైలు నుండి వారిని రాకుండా ఎలా చేయాలి అనేదానికే కాలాన్ని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతాంగ సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విధానాన్ని నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 20 తేదీ నుంచి క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం నవంబర్ నెలలో విజయవాడలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఉరవకొండ,వజ్రకరూరు మండలాల కన్వీనర్లు, రైతు సంఘం జిల్లా నాయకులతో పాటు సిపిఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పండ్లతోటల రైతుసంఘం రాష్ట్ర సదస్సు

హాజరుకానున్న రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రజాశక్తి అనంతపురం కలెక్టరెట్

పండ్ల తోటల రైతు సమస్యలు పరిష్కారం కోసం గురువారం తాడిపత్రిలో పండ్లతోటల రైతు సంఘం రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్లు పండ్ల తోటల రైతు సంఘ జిల్లా కార్యదర్శి వి శివారెడ్డి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ జిల్లాలో పండ్ల తోటల విస్తీర్ణం ప్రతి సంవత్సరం పెరుగుతోందన్నారు. జిల్లాలో రెండు లక్షల హెక్టార్లకు పైగా వివిధ రకాలైన పండ్లతోటలు సాగు అవుతున్నాయని చెప్పారు. ప్రధానంగా చీని, మామిడి, దానిమ్మ, అరటి, రేగు, సపోటా, కలింగర, జామ, బొప్పాయి, ద్రాక్ష, కర్బూజ తదితర పండ్ల తోటలు కాయకూరలు సాగు చేస్తున్నారని అన్నారు. పండ్ల తోటల సాగు పెట్టుబడులతో కూడుకున్నదని ఎక్కువ భాగం అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్నారని అన్నారు. జిల్లాలో ఇప్పటికీ సరైన మార్కెట్ సౌకర్యం లేక వ్యాపార వర్గాలు దళారులతో కుమ్మక్కై ఏదో ఒక సాకుతో ధరలు తగ్గిస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం దళారీల మోసాల నుండి రైతులను కాపాడాలని డిమాండ్ చేశారు. పండ్ల తోటల రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చేవిధంగా రైతుసమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొదించుటకు తాడిపత్రి పట్టణంలో నిర్వహించే రాష్ట్ర సదస్సులో రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు. ఈసదస్సుకు రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడిడ, జిల్లా ఉపాధ్యక్షులు వి రాంభూపాల్ హాజరువుతున్నట్లు తెలిపారు.

ఏర్పాట్ల తీరును పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్‌గార్గ్

పక్కాగా ఇవిఎంల మొదటి దశ తనిఖీ

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

ఇవిఎంలు, వివి ప్యాట్స్‌ల మొదటి దశ తనిఖీకార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతపురం నగరంలోని పాత ఆర్డీవో కార్యాలయం కాంపౌండ్ లో ఉన్న ఇవిఎం గోడౌన్‌లో ఇవిఎంలు, వివి ప్యాట్స్‌ల మొదటి దశ తనిఖీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కేతన్‌గార్గ్ మాట్లాడుతూ ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమంలో ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ఈనెల 16 నుంచి నవంబర్ 10వ తేదీ వరకు కొనసాగే ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో గాయత్రీ దేవి, అనంతపురం, గుంతకల్లు ఆర్డీవోలు మధుసూదన్, రవీంద్ర, డీపీవో ప్రభాకర్ రావు, తహశీల్దార్ శ్రీధర్ మూర్తి, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ కనకరాజు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జామినర్ X ఇంజనీరింగ్ సెక్షన్

కారు డ్రైవర్ వ్యవహారంలో రేగిన చిచ్చు - ఇంజినీరింగ్ సిబ్బంది పెన్‌డౌన్.., వర్కర్స్ టూల్ డౌన్ ..

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో కారు డ్రైవర్ నిర్వాకంతో ఎగ్జామినర్ వర్సెస్ ఇంజినీరింగ్ సెక్షన్ నడుమ బుధవారం వివాదం రాజుకుంది. సిబ్బంది కథనం మేరకు.. ఎగ్జామినర్ కార్ డ్రైవర్ ఉమాశంకర్ 15 రోజులుగా విధులకు హాజరుకాకపోవడంతో రెండు రోజుల ఆబ్సెంట్ వేశారు. అయితే 15 రోజులు విధులకు హాజరుకాకుండా రెండు రోజుల ఆబ్సెంట్ మార్క్ వేసి వేతనంలో కోత విధించటంపై కార్ డ్రైవర్ ఉమాశంకర్ ఎన్విరాన్మెంటల్ డిఇ రాంప్రసాద్‌రెడ్డిపై ఎగ్జామినర్ వెంకటరమణకు బుధవారం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో ఎగ్జామినర్ వెంకటరమణ ఫోనులో డిఇ రాంప్రసాద్‌రెడ్డితో దుర్భాషలాడాడు. వెంటనే ఎగ్జామినర్‌ను ఛాంబర్‌కు వెళ్లి నిలదీయాలని ప్రయత్నించిన డిఇని సిబ్బంది నిలువరించినట్లు తెలిసింది. ఈ విషయాన్ని సూపరింటెండెంట్ ఇంజినీర్ నాగమోహన్ దృష్టికి డిఇ తీసుకెళ్లగా ప్రతిఅంశంలో ఎగ్జామినర్ ఇదేతీరు వ్యవహరిస్తున్నాడని అభిప్రాయపడినట్లు తెలిసింది.

ఇదిలా ఉండగా నాలుగు రోజుల క్రితం జరిగిన జనరల్ బాడీ మీటింగ్‌లో సైతం అకౌంట్ సెక్షన్, ఇంజినీరింగ్ సెక్షన్ ఎగ్జామినర్ నడుమ సమన్వయం కొరబడింద, సరిదిద్దాల్సిన బాధ్యత కమిషనర్, మేయర్‌పై ఉందని సభ్యులు ప్రస్తావించిన విషయం తెలిసిందే. ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో వివాదాలు రోజుకొకటి వంతున జరుగుతుండటం విశేషం. ఎగ్జామినర్, ఇంజినీరింగ్ సెక్షన్, అకౌంట్ సెక్షన్ నడుమ అగాథం మరింత పెరిగి ప్రతి బిల్లులపై ప్రభావం పడి తీవ్ర జాప్యం జరుగుతుందన్న ఆందోళన అందరినీ కలవరపరుస్తోంది వ్యక్తమవుతోంది. ఈ దశలో ఎగ్జామినేర్ వైఖరికి నిరసనగా గురువారం నుంచి పెన్‌డౌన్, టూల్ డౌన్ చేయాలని అధికార కాంట్రాక్టు కార్మిక వర్గాలు నిర్ణయించటం అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ పరిపాలన స్తంభించే పరిస్థితులు నెలకొంటున్నాయి. దీన్ని సరిదిద్దాల్సిన బాధ్యత అధికారం చెలాయించాలనే ముఖ్య నేత, పాలకవర్గంపైనే ఉందటంలో అతిశయోక్తి లేదు. దీనిపై ఉన్నతాధికారులు నేతలు ఎలా స్పందిస్తారో.. ఎలా సమస్యల చిక్కుముడులను విడదీసి సమన్వయ పరుస్తారో వేచి చూడాల్సిందేనని నగరవాసులు అంటున్నారు.

దేశాభివృద్ధిలో యువత కీలకం

జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్

ప్రజాశక్తి-అనంతపురం

కార్యక్రమంలో మాట్లాడుతున్న జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌వి సత్యనారాయణ

దేశ అభివృద్ధికి యువత పట్టుకొమ్మలు లాంటివారని అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌వి సత్యనారాయణ తెలిపారు. బుధవారం స్థానిక జెఎన్‌టియు విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఎంబీఏ విభాగం) ఎన్ఎస్ఎస్ విభాగం, నెహ్రూ యువకేంద్రం (ఎన్‌వైకె) ఆధ్వర్యంలో స్థానిక ఆడిటోరియంలో మేరీ మాటీ మేరా దేశ్ అమృత కలశ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది పోరాటయోధుల పోరాట ఫలితంగా మనం సుఖంగా ఉన్నామమన్నారు. వారి త్యాగనిరతిని ముందుకు తీసుకెళ్లినప్పుడే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ విభాగాధిపతి టి.నారాయణరెడ్డి, నెహ్రూ యువకేంద్రం (ఎన్‌వైకె) అనంతపురం ప్రోగ్రాం ఇన్‌ఛార్జి జి.శ్రీనివాసులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాటి భరత్‌కుమార్, స్వచ్ఛ భారత్ అంబాసిడర్ బిసాటి జీవన్‌కుమార్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి నరసింహారెడ్డి, మేనేజ్‌మెంట్ విభాగం ఎన్ఎస్ఎస్ ఇన్‌ఛార్జి డి.వరలక్ష్మి, బీసీ లక్ష్మీనారాయణ, బసయ్య, జయరాంరెడ్డి, శ్రావణ్‌కుమార్, జాకీర్‌హుస్సేన్, విశ్వనాథ్, శ్రీలత, బోధనేతర సిబ్బంది ప్రసాద్, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.


జెఎన్‌టియు బాలబాలికల టెన్నిస్ జట్లు

జెఎన్‌టియు బాలబాలికల టెన్నిస్ జట్ల ఎంపిక

జెఎన్‌టియు బాల బాలికల టెన్నిస్ జట్లను బుధవారం స్థానిక క్రీడా మైదానంలో ఫిజికల్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. వీరు యూనివర్సిటీ తరపున ఆడనున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ జ్యోజిరెడ్డి తెలిపారు.

బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం జెఎన్‌టియు పరిధిలో నిర్వహించిన బీ.టెక్ 2వ సంవత్సరం 2వ సెమిస్టర్ (ఆర్.20) రెగ్యులర్, బీ.టెక్ 2వ సంవత్సరం, 2వ సెమిస్టర్ (ఆర్.19), (ఆర్15) సప్లిమెంటరీ ఫలితాలు, బీ.టెక్ 2వ సంవత్సరం, 1వ సెమిస్టర్ (ఆర్), (ఆర్), (ఆర్) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను బుధవారం విడుదల చేసినట్లు డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఇ. కేశవరెడ్డి, కంట్రోలర్ అఫ్ ఎక్సామినేషన్ బి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఫలితాల కోసం జెఎన్‌టియు వెబ్‌సైట్ http://jntuaresults.ac.in ను సంప్రదించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికే 'స్పందన'

ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం మండల స్థాయిలో జగన్న చెబుదాం 'స్పందన' కార్యక్రమం నిర్వహిస్తోందని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. బుధవారం పట్టణంలోని డ్వామా కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయదుర్గం మండల స్థాయిలో వచ్చిన అర్జీలను 10 రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయాల్లో ఆస్తులకు సంబంధించి జరిగే క్రయ, విక్రయాల రిజిస్ట్రేషన్లు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు సత్వర సేవలు సచివాలయాల ద్వారా అందేలా చూస్తామన్నారు.

అర్జీలను స్వీకరిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్‌గార్గ్

రైల్వేస్టేషన్ అభివృద్ధికి వినతి

118 సంవత్సరాల చరిత్ర కలిగిన రాయదుర్గం రైల్వేస్టేషన్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని నైరుతి రైల్వే హుబ్బల్లి డివిజన్ వినియోగదారుల సలహా మండలి మాజీ సభ్యులు గుడేకోట శివకుమార్, కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా నూతన భవనాలను ప్రారంభించి, మౌలిక సౌకర్యాలు కల్పించాలని, ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాయదుర్గంలోని అనంతపూర్ రోడ్డు, కనేకల్ రోడ్డు వద్ద ఉన్న రైల్వే క్రాసింగ్‌ల వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. రాయదుర్గం జంక్షన్‌లో నూతనంగా నిర్మించిన స్టేషన్ భవనాలలో ప్రయాణికులకు మౌలిక సౌకర్యాలు, వేచి ఉండే గది, మరుగుదొడ్లు, తాగునీరు, రైలు వేళల ప్రకటన, వివరాల ప్రదర్శన పట్టిక, రాయదుర్గం జంక్షన్ అను పేరిట నోటీసు బోర్డుల ప్రదర్శన, క్యాంటీన్, క్యాటరింగ్, ఎంక్వయిరీ సౌకర్యాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో విప్ కాపు రామచంద్రారెడ్డి, ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, డిఆర్‌డిఎపి నరసింహారెడ్డి, హౌసింగ్ డిఇ శైలజ, డిఎల్‌డిఒ శంకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'పై అవగాహన కల్పించాలి : విప్ కాపు, ఇన్‌ఛార్జి కలెక్టర్

రాయదుర్గం : జగనన్న ఆరోగ్య సురక్షపై అధికారులు గ్రామాల్లో అవగాహన కల్పించాలని విప్ కాపు రామచంద్రారెడ్డి, ఇన్‌ఛార్జి కలెక్టర్ కేతన్‌గార్గ్ సూచించారు. బుధవారం రాయదుర్గం పురపాలక సంఘంలోని అభ్యుదయ మోడల్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విప్ కాపు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎప్పుడు నిర్వహిస్తున్నారనే విషయంపై ముందుగా ఆయా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా రాయదుర్గం ప్రాంతంలో ఉన్న వారికి పరీక్షలు నిర్వహించి అర్హులైన వారికి సదరం సర్టిఫికెట్లు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో నాణ్యతగా వైద్యసేవలు అందించాలన్నారు. అనంతరం శిబిరంలో ఓపి, కేస్ షీట్స్, ఫోల్డర్లు, ఉచిత మందుల పంపిణీ, టెస్ట్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షురాలు పొరాళు శిల్ప, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఇబి.దేవి, కమిషనర్ దివాకర్‌రెడ్డి, డాక్టర్లు మనోజ్ కుమార్, అజహార్, ఇందులేఖ, ఎం.ఇబ్రహీం, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఇదేనా.. నాడు-నేడు ఘనత

బుక్కరాయసముద్రం మండలం పాత చెదుల్ల ప్రాథమిక పాఠశాల ముందు ఉన్న పెద్ద గోతి. గోతికి పెద్ద కర్రలు అడ్డం పెట్టారు. దీంతో ఎప్పుడేం జరుగుతుందో అని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే గోతిని పూడ్చి విద్యార్థులకు రక్షణ కల్పించాలని సిపిఎం మండల కార్యదర్శి పుల్లయ్య, వేణుగోపాల్, సంజీవరెడ్డి డిమాండ్ చేశారు.

వంగిన విద్యుత్ స్తంభానికి అడ్డుగు కర్రను పెట్టిన దృశ్యం

కర్రసాయంతో విద్యుత్ స్తంభం

ఆత్మకూరు : మండల కేంద్రంలోని బ్యాండ్ కన్నయ్యకట్ట వద్ద విద్యుత్ స్తంభం కూలడానికి సిద్ధంగా ఉంది. స్తంభాన్ని మార్చాలని సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. స్తంభం పూర్తిగా వాలుతుండటంతో చేసేది లేక స్థానికులే ఓ కర్రను సపోర్ట్‌గా పెట్టారు. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందో అని ఆందోళన చెందుతున్నామని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ స్తంభం మార్చాలని కాలనీవాసులు కోరుతున్నారు.

చివరి ఆయకట్టు వరకూ నీరివ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప

ఆందోళనలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు వరకూ సాగునీరు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ఆవోజాతాను బుధవారం మండల కేంద్రంలో ప్రారంభించారు. మండల కేంద్రం నుంచి ప్రారంభమైన జాతా సిద్దరాంపురం, దండువారిపల్లి, ఏడావులపల్లి, ఓబులాపురం, కొండాపురం, రేకులకుంట, అమ్మవారిపేట, రెడ్డిపల్లి, రోటరీపురం, కొర్రపాడు, నీలారెడ్డిపల్లి, వెంకటాపురం, దయ్యాలకుంటపల్లి, బయన్నపేట గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో విరివిగా ఉపాధి పనులు కల్పించాలని, విద్యుత్ ఛార్జీలను తగ్గించాలి, వ్యవసాయ మోటార్లకు మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలన్నారు. మండల కేంద్రంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని, నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు భూములకు నీరివ్వాలని, సిద్దరాంపురం, నారాయణపుకుంట, ఏడావులపల్లి చెరువులను నింపాలని, మండల కేంద్రంలో బాలికలకు ప్రత్యేక ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేయాలని, రోడ్లు నిర్మాణానికి భూములు నష్టపోయిన రైతులకు నష్టపరిహారంతోపాటు స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని, వెంకటాపురంలో వెల్నెస్ సబ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలని, భూమి లేని నిరుపేదలకు మూడెకరాలు భూమి ఇవ్వాలని, మండలంలో ఖనిజ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని, సిద్దరాంపురము గొర్రెల పెంపక క్షేత్రాన్ని పునరుద్ధరించాలని, మండలంలో పండ్ల తోటల మార్కెటింగ్, రసాల పరిశ్రమలను ఏర్పాటు చేయాలని, వందశాతం డ్రిప్పు, స్ప్రింక్లర్లను ఇవ్వాలనే తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు వి.శివారెడ్డి, మండల కార్యదర్శి ఆర్.కుళ్లాయప్ప, మండల కమిటీ సభ్యులు పుల్లయ్య, చెన్నప్ప, వేణుగోపాల్, సంజీవరెడ్డి, వ్య.కా.సం నాయకులు నాగలింగమయ్య, అంబేద్కర్ పోరాటాల పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు చిన్న అంజనేయులు, సిపిఎం నాయకులు రాముడు, అంకాలు, గోపీ, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే అభివృద్ధి : ఎస్పీ

దుస్తులు పంపిణీ చేస్తున్న ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్, ఆర్టీటీ మహిళా సాధికారత విభాగం డైరెక్టర్ విశాలాఫెర్రర్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

మహిళా సాధికారతతోనే అభివృద్ధి సాధ్యమని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. ఆర్టీటీ, జిల్లా పోలీసు శాఖ, దాతల సహకారంతో బుధవారం నగరంలోని షికారీ కాలనీలో ఉన్న 55 కుటుంబాలకు వివిధ రకాలుగా సహాయం అందించారు. ముఖ్యంగా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, ఆర్టీటీ మహిళా సాధికారత విభాగం డైరెక్టర్ విశాలాఫెర్రర్ ఆధ్వర్యంలో 14 మంది వికలాంగులకు ట్రై సైకిళ్లు, వీల్ ఛైర్లు, కృత్రిమ అవయవాలు, వాకింగ్ స్టిక్స్ అందజేశారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని 90 మంది మహిళలకు చీరలు, 80 మంది పురుషులకు షర్టులు, లుంగీలు, టవళ్లు, 146 మంది చిన్న పిల్లలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం డీఎస్పీ జి.ప్రసాదరెడ్డి, ఆర్టీటీ హౌసింగ్ విభాగం డైరెక్టర్ రాజశేఖరరెడ్డి, వికలాంగుల విభాగం డైరెక్టర్ రఫిక్, రీజినల్ డైరెక్టర్ లక్ష్మణరావు, ఏటీఎల్ మల్లికార్జున, ఎస్పీ సీసీ జాకీర్ హుస్సేన్, డీసీఆర్బీ సీఐ విశ్వనాథచౌదరి, వన్ టౌన్ సీఐ రెడ్డప్ప, దాతలు కళ్యాణచక్రవర్తి, శివకుమార్, యోగేష్ కుమార్, మిత్రబృందం పాల్గొన్నారు.

చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలి

జాయింట్ రీప్లేస్‌మెంట్, ఆర్థోస్కోపిక్ సర్జన్ ప్రదీప్

ప్రజాశక్తి-అనంతపురం

తల్లిదండ్రులు చిన్నారులు ఆడుకునేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని జాయింట్ రీప్లేస్‌మెంట్, ఆర్థోస్కోపిక్ సర్జన్ ప్రదీప్ సూచించారు. నేడు వరల్డ్ పీడియాట్రిక్ బోన్, జాయింట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాశక్తితో మాట్లాడుతూ చిన్న పిల్లల్లో వచ్చే ఆర్థో సమస్యల పరిష్కారానికి ప్రపంచ వ్యాప్తంగా అక్టోబర్ 19న వరల్డ్ పీడియాట్రిక్ బోన్, జాయింట్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పిల్లల్లో కండరాల పరిస్థితులు, ఎదురయ్యే ప్రభావాల గురించి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. సాధారణంగా మస్క్యులోస్కెలెటల్ డిజార్డర్స్ అని పిలిచే ఎముక, కీళ్ల ఇన్ఫెక్షన్లు, నరాలు, కండరాలు, ఎముకలు, కీళ్లు, స్నాయువులను ప్రభావితం చేస్తాయన్నారు. పిల్లల్లో మస్క్యులోస్కెలెటల్ డిజార్డర్స్ అత్యంత సాధారణ కారణాల్లో కొన్ని రోడ్డు ప్రమాదాలు, క్రీడా ప్రదేశాల్లో ఆటలాడుతున్నప్పుడు తగిలిన గాయాలు, స్థూలకాయం, వెన్నుపూస భంగిమల్లో మార్పులు, విటమిన్ డి లోపం కండరాల కణజాల రుగ్మతకు ఇతర దోహదపడే కారకాలు అన్నారు. పిల్లలు టీవీ, మొబైల్‌కు పరిమితమైనందున చలనం లేని జీవితాన్ని గడుపుతున్నారన్నారు. దీంతో శారీరక చురుకుదనం లేకపోవడం ఎముకల వ్యాధులకు కారణమవుతోందన్నారు. కావున వాకింగ్, జాగింగ్, రన్నింగ్, మెట్లు ఎక్కించడం వంటివి చేస్తే ఎముకలు బలోపేతం అవుతాయన్నారు. అంతేగాకుండా ఆటలు పిల్లల మనోవికాసానికి దోహదపడుతాయన్నారు.

ప్రభుత్వ గుర్తింపు పొందిన సర్టిఫికెట్లు మాత్రమే చెల్లుబాటు

పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్

మాట్లాడుతున్న గోవిందనాయక్

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఓపెన్ టెన్త్, ఇంటర్ సర్టిఫికెట్లు మాత్రమే చెల్లుబాటు అవుతాయని పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ తెలిపారు. బుధవారం నగరంలోని కెఎస్ఆర్ హైస్కూల్లో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసి మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా ఓరియంటల్ ఎడ్యుకేషన్ సొసైటీ స్కూల్ సర్టిఫికెట్, హర్యానా స్టేట్ బోర్డు జారీ చేసిన నకిలీ సర్టిఫికెట్లు సోషల్ మీడియాలో, పత్రికల్లో చలామణి అవుతున్నాయన్నారు. కావున ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అనుమతి పొందిన బోర్డు నుంచి జారీ చేసిన 10వ తరగతి, ఇంటర్ సర్టిఫికెట్లు మాత్రమే చెల్లుబాటు అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి జిల్లా ఏడీ లాజర్, డిప్యూటీ డిఇఒలు వి.పద్మప్రియ, సి.రంగస్వామి, ఎంఇఒ వెంకటస్వామి, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

శింగనమల : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాచేపల్లి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని రామాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మాదిగల జనాభా అధికంగా ఉన్నా జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాధాన్యత కల్పించడం లేదన్నారు. మాదిగలకు ఏ రాజకీయ పార్టీ న్యాయం చేస్తుందో వారికి మా మద్దతు ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఈనెల 26న తిరుపతి నుంచి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరు పోగువెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారన్నారు. ఈ యాత్ర నవంబర్ 30న విజయవాడ చేరుకుని జింఖానా మైదానంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సభలో అధిక సంఖ్యలో మాదిగలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు లక్ష్మీనారాయణ, జిల్లా ఇన్‌ఛార్జి కోటంక మల్లేసు, ఎంఎస్ఎఫ్ సత్యసాయి జిల్లా అధ్యక్షులు ఆదిశేషు, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు చిరంజీవి, ఉపాధ్యక్షులు సుమన్, ఎమ్మార్పీఎస్ నాయకులు శీనయ్య, భార్గవ్, ప్రసాద్, బాలగిరి, శేసు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీమంత్రుల అరెస్టు అన్యాయం : టిడిపి

విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మాజీమంత్రులు కొల్లు రవీంద్ర, దేవినేని ఉమాను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమని టిడిపి బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల కృష్ణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీనరసింహులు ఖండించారు. బుధవారం స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడం బాధాకరమన్నారు. అంతేగాకుండా వ్యవస్థలను మేనేజ్ చేస్తూ టిడిపి నాయకులను మానసిక ధైర్యాన్ని దెబ్బతీయాలని వైసిపి చూస్తోందన్నారు. చంద్రబాబుపై అభిమానంతో ఆగిన ప్రతి గుండెనూ, వారి కుటుంబ సభ్యులకు నారా భువనేశ్వరి స్వయాన ప్రతిఇంటికీ వెళ్లి పరామర్శిస్తారని వివరించారు. ఇందులో భాగంగానే టిడిపి బీసీ సెల్ విభాగం రాష్ట్రవ్యాప్తంగా సైకిల్ ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిస్తే టిడిపి రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రను అరెస్టు చేయడం బాధాకరమన్నారు. ఆఖరికి తన తల్లిని వర్ధంతి రోజు అని తెలిసినప్పటికీ అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. ఈ సమావేశంలో బీసీ జిల్లా ఉపాధ్యక్షులు కనుమ చౌడయ్య, టిఎన్‌టియుసి రాష్ట్ర అధికార ప్రతినిధి బ్యాల నాగేంద్ర, కురుబ సాధికారిక రాష్ట్ర డైరెక్టర్ నారాయణస్వామి, బీసీ సెల్ కార్యదర్శి చంద్రాయుడు, లోలూరు నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తలపై ఫిర్యాదు

కుందుర్పి : మండల పరిధిలోని మాయదార్లపల్లి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్తలపై వైసిపి నాయకులు మంగళవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు మాట్లాడుతూ గత ఆదివారం రాత్రి టిడిపి నాయకులు నిర్వహించిన న్యాయానికి సంకెళ్లు కార్యక్రమంలో మంత్రి ఉషశ్రీ చరణ్, సిఎం జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కాగా సిఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైసిపి నాయకులు అన్నారు. ఈమేరకు బుధవారం మాయదార్లపల్లి గ్రామంలో మంత్రి ఉషశ్రీచరణ్, సిఎం జగన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, వాల్మీకి రాష్ట్ర డైరెక్టర్ పాలాక్షి, సర్పంచి లలితమ్మ బొమ్మయ్య, మాజీ సర్పంచి శివశంకర్‌రెడ్డి, ఈరన్న తదితరులు ఉన్నారు.

పెన్నోబిలేసుడి ఆలయానికి నిధులు మంజూరు

ఉరవకొండ : మండల పరిధిలోని పెన్నాహోబిలం లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.1.25 కోట్లు మంజూరు చేసినట్లు శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్ వై.శివరామిరెడ్డి తెలిపారు. భక్తుల సౌకర్యార్థం వసతి గృహాల సముదాయం (డార్మెంటరీ హాలు) నిర్మించాలని దాదాపు రూ.2కోట్లతో అంచనాలు వేయించి దేవాదాయ శాఖ వారికి నివేదికలు పంపగా కామన్ గుడ్ ఫండ్ నుంచి నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

పాల్తూరులో పారిశుధ్య పనులు

ఉరవకొండ : విడపనకల్లు మండల పరిధిలోని పాల్తూరు గ్రామంలో సర్పంచి బ్యులారాణి రాజశేఖర్, పంచాయతీ సెక్రటరీ రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీలు వెంకటేశులు, శివ, వైసీపీ నాయకులు నాగరాజు, షణ్ముఖగౌడ్, నల్ల సుంకన్న, డిష్ వెంకటేశులు, గంగన్న, సిద్ధరాం, శర్మాస్, రోగప్ప, తదితరులు పాల్గొన్నారు.

20, 21న కలెక్టరేట్ ఎదుట దీక్షలు

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల మంది ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 20, 21వ తేదీల్లో కలెక్టరేట్ల ఎదుట దీక్షలు చేపట్టనున్నట్లు ఎస్టీయు నాయకులు తెలిపారు. ఈమేరకు బుధవారం అనంతపురంలోని ఉపాధ్యాయ భవనంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు జి.సూర్యుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.రమణారెడ్డి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి కె.చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్ ఫణిభూషణ్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శులు, రాజశేఖర్ నాగభూషణ, మురళీకృష్ణ, బుక్కరాయసముద్రం మండల ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

20న వాహనాల వేలం

అనంతపురం : రాప్తాడు పోలీసుస్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన నాలుగు వాహనాలకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అసిస్టెంట్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు సెబ్ అధికారుల సమక్షంలో ఈనెల 20న వేలం వేయనున్నట్లు ఎస్ ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

24న గుత్తిలో ప్రజావేదిక

గుత్తి : ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఈనెల 20 తేదీన గుత్తిలో ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎపిఒ మద్దిలేటి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6వ తేదీ నుంచి 19వ తేదీ వరకూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీలు చేసినట్లు తెలిపారు. ప్రజావేదికకు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరవుతారని తెలిపారు.

డ్రిప్పు పరికరాల పరిశీలన

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో ఎపిఎంఐపి ద్వారా మంజూరైన డ్రిప్పు పరికరాలను జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ బుధవారం రైతుల పొలాలకు పరిశీలించారు. ఇందులో భాగంగా ఎపిఎంఐపి పీడీ ఫిరోజ్‌ఖాన్, రాయదుర్గం సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మానాయక్ కలిసి స్వయంగా రైతుల పొలాలను చూపించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహేంద్ర, ఉద్యానవన శాఖ అధికారిణి మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు నాణ్యతగా చేయాలి : సిపిఎం

కూలిన కల్వర్టును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

అనంతపురం కలెక్టరేట్ : నగరంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను నాణ్యతగా చేపట్టాలని సిపిఎం 1వ నగర కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆరు నెలల క్రితం నగరంలోని పాత డిఇఒ కార్యాలయం వద్ద నిర్మించిన కల్వర్టు కూలిపోవడంతో విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో రూ.వందల కోట్లతో బళ్లారి రోడ్డు నుంచి పంగలరోడ్డు దాకా నిర్మిస్తున్న రోడ్డు నాసిరకంగా ఉందన్నారు. ఇక కల్వర్టులు చిన్న వాహనాలు తిరిగితేనే కూలిపోతున్నాయన్నారు. ఆర్అండ్‌బి అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే పనులు నాణ్యతగా చేశారన్నారు. ఎందుకంటే కూలిన కల్వర్టును పరిశీలిస్తే చిన్న కడ్డీలు వేయడంతోపాటు కంకర, ఇసుక, సిమెంట్ సమపాళ్లలో కలిపి నిర్మించేలేదని అర్థం అయిందన్నారు. నాసిరకంగా పనులు జరుగుతున్నా నేషనల్ హైవే, మున్సిపల్ అధికారులు ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. అదేవిధంగా రెండవ రోడ్డులో గతవారం క్రితం వేసిన తారురోడ్డు కూడా నాణ్యతగా లేదన్నారు. ఆయా పనులను చేసిన కాంట్రాక్టర్లను వెంటనే బ్లాక్ లిస్టులో పెట్టాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అన్నివర్గాలకూ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే పద్మావతి

నార్పల : పార్టీలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. బుధవారం మండలంలోని గంగనపల్లి, ముచ్చుకుంటపల్లి, తుంపెర గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు సిఎం జగన్ ఇచ్చిన హామీల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత 99శాతం అమలు చేశారన్నారు. అనంతరం గంగనపల్లిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు సత్యనారాయణరెడ్డి, ఎంఇఎంఎస్ రాష్ట్ర డైరెక్టర్ నిట్టూరు రఘునాథరెడ్డి, జెడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపిపి నాగేశ్వరరావు, మండల ప్రత్యేకాధికారి మహమ్మద్ రఫీ, తహశీల్దార్ హరికుమార్, ఐఒఆర్‌డి లక్ష్మీనరసింహా, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రవీంద్రనాథ్‌రెడ్డి, వైద్యులు ప్రవీణ్‌కుమార్, రవిశంకర్, సాదియా, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం..

బ్రహ్మసముద్రం : బాల్య వివాహాలను అరికట్టి ఆడబిడ్డలను కాపాడుకుందామని ఐసిడిఎస్ సిడిపిఒ లక్ష్మీప్రసన్న పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ఎస్.కోనాపురం ఆర్‌డిటి పాఠశాలలో ఆర్‌డిటి, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'బాల్య వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత' అనే అంశంపై ఆర్‌డిటి సిఒ రామకృష్ణ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో బాలల పట్ల వివక్ష తీవ్రరూపం దాల్చిందన్నారు. ముఖ్యంగా బాల్య వివాహాలు, బాలలపై లైంగిక వేధింపులు ఎక్కువ అవుతున్నాయన్నారు. కావున బాల్య వివాహాలను అరికట్టి బాలికలను రక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిటి టీం లీడర్ ఆదినారాయణ, ఏరియా టీం లీడర్ బాషా, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కాశింబీ, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి వినోదమ్మ, ఆర్‌డిటి సిఓ రామకృష్ణ, ఉపాధ్యాయుడు జయరాజ్, ఎంపిటిసి సువర్ణమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త కుటుంబానికి పరామర్శ

శింగనమల : మండల కేంద్రానికి చెందిన టిడిపి కార్యకర్త హాజీ అనారోగ్యంతో మృతిచెందడంతో టిడిపి అనంతపురం అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాల్లో హాజీ చురుగ్గా పాల్గొనేవారన్నారు. అలాంటి కార్యకర్తను కోల్పోడం తీరని లోటన్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో టిడిపి నాయకులు సైదా, కొయ్యగూర పెద్దన్న, మొండిపోగుల ఎర్రిస్వామి, బోయ సుధాకర్, హరి, రవి, అంజి, శ్రీరాములు, రాచేపల్లి శ్రీనాథ్, తదితరులు ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి : బండారు శ్రావణి

బుక్కరాయసముద్రం : ఖరీఫ్‌లో పంటలు సాగు చేసి నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకోవాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని దండువారిపల్లి పంచాయతీలో సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు లక్షలు పెట్టుబడి పంటలు సాగు చేస్తే వర్షాభావ పరిస్థితిలతో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం తలెత్తిందన్నారు. కావున ప్రభుత్వం స్పందించి పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆదినారాయణ, తలారి రంగయ్య, బంగి నాగేంద్ర, పెద్దప్ప, ఎంపీటీసీ కొరపాడు ఆదినారాయణ, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో చిన్నారులకు వస్తువుల పంపిణీ

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో ట్రస్టు నిర్వాహకులు, దంపతులైన నిర్మలామురళి, పురుషోత్తమ మురళీకృష్ణ ప్రభుత్వ ఆసుపత్రిలోని చిన్నపిల్లల వార్డులో 150 మంది చిన్నారులకు బుధవారం ఆరు రకాల వస్తువులు పంపిణీ చేశారు. చిన్నారులకు వస్తువులను అందించడానికి సాయి ఆదిత్య కన్‌స్ట్రక్షన్ సంస్థ సహకారం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఒ డాక్టర్ పద్మజ, డిప్యూటీ ఆర్ఎంఒ డాక్టర్ హేమలత, డాక్టర్ సునీత, వినీత్ రమణ, బాబా, బాబావలి, ప్రభుకుమార్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బావపై బావమరిది దాడి

గాయపడిన బలరాం

కళ్యాణదుర్గం : ఆస్తి తగాదాలతో బావపై బావమరిది దాడి చేసిన ఘటన బుధవారం కళ్యాణదుర్గంలో చోటుచేసుకుంది. బ్రహ్మసముద్రం మండలం యనకల్లు గ్రామానికి చెందిన బలరాం, హనుమంతరాయుడు బావా బావమరుదులు. అయితే కొద్దిరోజులుగా ఇరు కుటుంబాలకు ఆస్తితగాదాలు ఏర్పడ్డాయి. ఈక్రమంలోనే బుధవారం పట్టణంలోని ఓ పెట్రోల్ బంకు వద్ద హనుమంతరాయుడు బావ బలరాంపై దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడటంతో స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో క్షతగాత్రుడిని అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ విఆర్ఒ మృతి

నార్పల : మండల పరిధిలోని వెంకటాంపల్లి వీఆర్ఓగా విధులు నిర్వహిస్తున్న వెంకటరమణ (56) చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. వివరాల్లోకి వెళ్తే.. వెంకటరమణ అనారోగ్యం కారణంగా కొద్దిరోజులుగా బెంగళూరు సెయింట్‌జాన్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చికిత్స పొందుతున్నాడు. ఈనేపథ్యంలో బుధవారం ఉదయం పరిస్థితి విషమించి మృతిచెందినట్లు తెలిపారు. విఆర్ఒ మృతికి తహశీల్దార్ హరికుమార్, రెవెన్యూ సిబ్బంది సంతాపం ప్రకటించారు.

భర్తపై భార్య దాడి..

అనంతపురం క్రైం : భర్తపై భార్య కొడవలితో దాడి చేసిన ఘటన మంగళవారం రాత్రి నగరంలోని కోవూరునగర్‌లో చోటు చేసుకుంది. 4వ పట్టణ సీఐ ఆర్.ప్రతాపరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. జయసూర్యారెడ్డి మెడికల్ షాపులో సేల్స్‌మేన్‌గా పని చేస్తున్నాడు. భార్య ప్రమీలమ్మ టైలరింగ్ పని చేస్తోంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రమీల హైపర్ టెన్షన్‌తో బాధ పడుతోంది. సైకలాజికల్‌గా ఫీలవుతూ తరచూ కూతుర్లను దుర్భాషలాడుతూ ఉండేది. దీంతో జయసూర్యారెడ్డి కూతుళ్లను ఎందుకు తిడుతున్నావని భార్యతో వాదనకు దిగేవాడు. ఇందులో భాగంగానే మంగళవారం రాత్రి యథావిధిగా భార్యను మందలించి నిద్రపోయాడు. అసలే హైపర్ టెన్షన్‌తో ఉన్న ప్రమీలమ్మ కోపంతో కొడవలితో నిద్రపోతున్న భర్త తలపై నరికింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో జయసూర్యారెడ్డిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమీలమ్మను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

విద్యుత్ శాఖ అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

విద్యుత్ సరఫరాలో సమయపాలన పాటించాలి : సిపిఎం

గుంతకల్లు : మండలంలో సకాలంలో విద్యుత్ సరఫరా చేసి రైతులకు సహకరించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం పట్టణంలో విద్యుత్ శాఖ డిఎఇ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలో వ్యవసాయానికి తెల్లవారుజామున, అర్ధరాత్రి దాటిన తర్వాత విద్యుత్ సరఫరా చేస్తున్నారన్నారు. దీంతో రైతులు రాత్రంతా మేలుకోవడంతోపాటు పొలాల్లో విష పురుగులకు కాటుకు బలౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున రైతులు క్షేమం కోసం రైతులకు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సాకే నాగరాజు, కసాపురం రమేష్, తిమ్మప్ప, అబ్దుల్లా, చరణ్, రామునాయక్, చొక్కా సునీల్, మల్లి, తదితరులు పాల్గొన్నారు.

ప్రాపర్టీ కేసుల ఛేదింపునకు కృషి చేయాలి : ఎస్పీ

అనంతపురం క్రైం : ప్రాపర్టీ కేసుల ఛేదింపునకు కృషి చేయడంతోపాటు చోరీలపై ముందస్తు నిఘా ఉంచాలని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఇటుకలపల్లి పోలీసుస్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ నేరాల్లో సీజ్ చేసిన వాహనాలను త్వరితగతిన డిస్పోజల్ చేయాలన్నారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్, సర్కిల్ పరిధిలో ఉన్న గ్రామాల్లోని తాజా పరిస్థితులపై ఆరాతీశారు. సిబ్బందిని సమన్వయం చేసుకుని కేసులు పెండెన్సీ లేకుండా చూసుకోవాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, విజిబుల్ పోలీసింగ్ బలోపేతం, మహిళలపై నేరాలు జరుగకుండా చర్యలు, ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు సీఐ నరేంద్రరెడ్డి ఉన్నారు.

నేడు ఆర్టీసీ నూతన వైద్యశాల భవనం ప్రారంభం

అనంతపురం : నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన నూతన ఆర్టీసీ వైద్యశాల భవనాన్ని ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన గురువారం ప్రారంభించనున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆథోని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ సిబ్బందికి మెరుగైన వైద్యం అందించేందుకే ఈ భవనాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విశ్వరూప్, ఉషశ్రీచరణ్, విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ తలారి రంగయ్య, కలెక్టర్ గౌతమి, ఆర్టీసీ ఛైర్మన్ అబ్బిరెడ్డిగారి మల్లికార్జునరెడ్డి, మేయర్ వసీం, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

పేదలకు మెరుగైన ఆరోగ్యమే 'సురక్ష' లక్ష్యం

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

పేదలకు మెరుగైన ఆరోగ్యం అందిచేందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం నిర్వహిస్తోందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని టీవీ టవర్, పాతూరు కస్తూరిబా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఎక్కడా, ఎన్నడూ లేనివిధంగా సిఎం జగన్ రాష్ట్రంలో ఎన్నో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చారన్నారు. ఇందులో భాగంగానే సురక్ష ద్వారా ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు వివరించారు. గతంలో దివంగత సిఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్య శ్రీ తీసుకొచ్చి 1000 జబ్బులకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యం అందిస్తే, ఆయన తనయుడు సిఎం జగన్ 3,500పైగా జబ్బులను ఆరోగ్యశ్రీలోకి తీసుకొచ్చారని గుర్తుచేశారు. అంతేకాకుండా వైద్యరంగంలో అనేక మార్పులను తీసుకొచ్చారన్నారు. అంతేగాకుండా వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, అర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేసి కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ 'జగనన్న ఆరోగ్య సురక్ష' క్యాంప్ లను సద్వినియోగం చేసుకోవాలన్నారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా యూత్ ప్రెసిడెంట్ మదన్‌మోహన్‌రెడ్డి, సర్పంచి ఉదయ్, ఉపసర్పంచి సుమిత్రా, కార్పొరేటర్ బాబా ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కాయగూరలు, ఆకుకూరల ప్రదర్శనను తిలకిస్తున్న దృశ్యం

ఆరోగ్య సురక్ష వివరాలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

పెద్దపప్పూరు : మండల పరిధిలోని దేవుని ఉప్పులపాడు గ్రామంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పిటిసి రమాదేవి, తహశీల్దార్ లక్ష్మీకాంత్‌నాయక్, ఎంపిడిఒ రామకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రత్యేక వైద్య నిపుణులు గ్రామాలకే వచ్చి ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకోవడంతోపాటు ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం డాక్టర్ ఉషారాణి వైద్య బృందం ఆధ్వర్యంలో దాదాపు 200 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. తర్వాత పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రామ్మూర్తిరెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, రంగేశ్వర్‌రెడ్డి, రామానుజులరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రామలక్ష్మి, నారాయణమ్మ, వీఆర్వో ప్రసాద్, పంచాయతీ సెక్రటరీ రమేష్, అంగన్‌వాడీలు ఉమాదేవి, పద్మావతి, మహాలక్ష్మి, వరలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.